




ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం

# జనం ముచ్చట

బుధవారం, సెప్టెంబర్ 16, 2026 | తెలంగాణ | పేజీలు : 4

## హార్వెస్ట్ కళాశాలలో...

# వినాయక మాల వివాదం

### విద్యార్థులకు తరగతుల్లోకి అనుమతి నిరాకరణపై బీజేపీ, ఏబీవీపీ నేతల నిరసన




2 లో..

**ఖమ్మం సిటీ (జనం ముచ్చట):** ఖమ్మం నగరంలోని హార్వెస్ట్ జూనియర్ కళాశాల వద్ద మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వినాయక మాల ధరించిన ఆరుగురు విద్యార్థులకు కళాశాలలోకి అనుమతి నిరాకరించడంతో పాటు,వారిని తరగతులకు హాజరుకాకుండా బయట నిలబెట్టారని విద్యార్థుల కుటుంబ సభ్యులు ఆరోపించారు.మాల తొలగించి వస్తేనే తరగతులకు అనుమతిస్తామని కళాశాల యాజమాన్యం తెలిపిందని వారు పేర్కొన్నారు.కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. వినాయక చవితి సందర్భంగా ఆరుగురు విద్యార్థులు వినాయక మాల ధరించి కళాశాలకు వెళ్లారు. అయితే మాల ధరించిన కారణంగా వారిని తరగతుల్లోకి అనుమతించకుండా కళాశాల బయట నిలబెట్టడమే కాకుండా విద్యార్థులను ఇళ్లకు పంపించారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని విద్యార్థుల కుటుంబ సభ్యులు బీజేపీ, ఏబీవీపీ నాయకులు,హిందూ సంఘాల నేతల దృష్టికి తీసుకెళ్లారు.దీంతో బీజేపీ పార్టీ రాష్ట్ర నాయకులు గల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు, బీజేపీ, ఏబీవీపీ నాయకులు హార్వెస్ట్ కళాశాల వద్దకు చేరుకుని నిరసన చేపట్టారు.





**మతపరమైన ఆచారాలను అడ్డుకోవడంపై అభ్యంతరం....**

విద్యార్థులు తమ మతపరమైన ఆచారాల్లో భాగంగా వినాయక మాల ధరించడాన్ని కళాశాల యాజమాన్యం అడ్డుకోవడం సరికాదని నిరసనకారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యార్థుల విశ్వాసాలు, మతపరమైన ఆచారాలను గౌరవించాల్సిన బాధ్యత విద్యాసంస్థలపై ఉందని వారు పేర్కొన్నారు.వినాయక మాల తొలగించాలన్న నిబంధనను ఎవరి ఆదేశాలతో అమలు చేస్తున్నారని గల్లా సత్యనారాయణ కళాశాల యాజమాన్యాన్ని ప్రశ్నించారు.విద్యార్థులను తరగతులకు ఎందుకు అనుమతించలేదో యాజమాన్యం స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు....




2 లో..

## శ్రీనివాసనగర్ టింబర్ డిపోలను...

# నగరం బయటికి తరలించాలి

### ఖమ్మం కార్పొరేషన్ ఎదుట బాధితులతో కలిసి సీపీఎం భారీ ధర్నా

## పేదల ఇళ్ల తొలగింపు నోటీసులు ఉపసంహరించాలి...

## “మరో వెలుగుమట్ల సమస్యగా చేయకండి”

### సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

**ఖమ్మం సిటీ (జనం ముచ్చట):** ఖమ్మం నగరంలోని శ్రీనివాస్ నగర్ ప్రాంతంలో గత 50 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న పేదల ఇళ్లను తొలగించాలని మున్సిపల్ అధికారులు జారీ చేసిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పేదల ఇళ్ల తొలగింపు నోటీసులకు వ్యతిరేకంగా సీపీఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బాధితులతో కలిసి ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు.సీపీఎం ఖమ్మం డివిజన్ నాయకులు ఎస్కే సైదులు అధ్యక్షతన జరిగిన ధర్నాలో నున్నా నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. శ్రీనివాస్ నగర్ ప్రాంతంలో గత ఐదు దశాబ్దాలుగా వేలాది మంది పేదలు పక్కా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారని తెలిపారు. గతంలో ప్రభుత్వం వారికి పట్టాలు ఇచ్చిందని, అలాంటి ఇళ్లను ఇప్పుడు తొలగించేందుకు మున్సిపల్ అధికారులు నోటీసులు ఇవ్వడం దుర్మార్గమని ఆయన విమర్శించారు.

(మొదటి పేజీ తరువాయి)

# హార్వెస్ట్ కళాశాలలో... వినాయక మాల వివాదం




**మెయిన్ గేటు ముందు బైఠాయింపు...**

కళాశాల యాజమాన్యం తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు, బీజేపీ,ఏబీవీపీ నాయకులు కళాశాల మెయిన్ గేటు ముందు బైఠాయించి నిరసన తెలిపారు.విద్యార్థుల హక్కులను కాపాడాలని, మతపరమైన ఆచారాల విషయంలో వివక్షకు తావులేకుండా చూడాలని వారు డిమాండ్ చేశారు.విద్యార్థులను తిరిగి తరగతులకు అనుమతించాలని,జరిగిన ఘటనపై కళాశాల యాజమాన్యం పూర్తి వివరణ ఇవ్వాలని నిరసనకారులు డిమాండ్ చేశారు,సమస్యపై యాజమాన్యం స్పష్టత ఇచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని వారు హెచ్చరించడంతో దిగివచ్చిన కళాశాల యాజమాన్యం స్వయంగా విద్యార్థులకు కుంకుమ బోట్లు పెట్టి కళాశాలలోకి తీసుకువెళ్ళారు....

**గత ఆరోపణలను ప్రస్తావించిన ఆందోళనకారులు...**

ఈ సందర్భంగా గతంలో హార్వెస్ట్ కళాశాలపై వచ్చిన వివిధ ఆరోపణలను కూడా పలువురు ప్రస్తావించారు. ముఖ్యంగా డ్రగ్స్‌కు సంబంధించిన వ్యవహారాలతో పాటు, ఇద్దరు విద్యార్థుల మరణాల విషయంలో కూడా కళాశాల యాజమాన్యం తీరుపై గతంలో పలు ఆరోపణలు వచ్చాయని వారు పేర్కొన్నారు. ప్రస్తుత ఘటన నేపథ్యంలో ఆ అంశాలపై కూడా సమగ్రంగా విచారణ జరిపించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు.అయితే గతంలో వచ్చిన ఆరోపణలు, ప్రస్తుత ఘటనకు సంబంధించిన ఆరోపణలపై కళాశాల యాజమాన్యం అధికారికంగా ఏం చెబుతుందన్నది స్పష్టంగా తెలియాల్సి ఉంది.అప్పటి వరకూ ఆందోళనకారుల చేసిన ఆరోపణలు నిర్ధారిత వాస్తవాలుగా కాకుండా ఆరోపణలుగానే పరిగణించాల్సి ఉంటుంది.

**విద్యాసంస్థల నిబంధనల మధ్య సమతుల్యత అవసరం....**

ఖమ్మంలో సామరస్యాన్ని కాపాడాల్సిన బాధ్యత మతపరమైన ఆచారాలు, విద్యార్థుల హక్కులు, విద్యాసంస్థల నిబంధనల మధ్య సమతుల్యత అవసరమని ప్రజా సంఘాలు, మేధావులు పేర్కొంటున్నారు.ఒక విద్యార్థి మతపరమైన విశ్వాసానికి సంబంధించిన అంశం వివాదంగా మారకుండా కళాశాల యాజమాన్యం, తల్లిదండ్రులు, విద్యార్థులు పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని వారు సూచిస్తున్నారు.ఖమ్మం వంటి సామాజిక సామరస్యానికి పేరున్న నగరంలో మతాల మధ్య వైషమ్యాలకు దారితీసే పరిస్థితులు తలెత్తకుండా అధికారులు, విద్యాసంస్థలు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి....

**ఘటనకు దారితీసిన పరిస్థితులపై యాజమాన్యం స్పష్టత ఇవ్వాలి....**

ప్రస్తుతం హార్వెస్ట్ కళాశాలలో జరిగిన ఈ ఘటనపై విద్యార్థుల కుటుంబ సభ్యుల ఆరోపణలకు కళాశాల యాజమాన్యం స్పష్టమైన అధికారిక వివరణ ఇవ్వాల్సి ఉంది.అసలు ఘటనకు దారితీసిన పరిస్థితులు, కళాశాలలో అమల్లో ఉన్న నిబంధనలు, విద్యార్థులకు తరగతుల్లోకి ఎందుకు అనుమతి నిరాకరించారన్న అంశాలపై యాజమాన్యం వివరణ ఇచ్చిన తర్వాతే పూర్తి వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ గల్లా సత్యనారాయణ,భారతీయ జనతా యువమోర్చా బీజేవైఎం ఖమ్మం జిల్లా అధ్యక్షులు శాసనాల సాయిరాం ,బిజెపి ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు నకిరికంటి వీరభద్రం,ఆచంటి కోటేశ్వరరావు,పిల్లలమరి వెంకట్,దీకొండ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు...

# శ్రీనివాసనగర్ టింబర్ డిపోలను... నగరం బయటికి తరలించాలి




(మొదటి పేజీ తరువాయి)

**50 ఏళ్లుగా పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు....**

శ్రీనివాస్ నగర్‌లో నివసిస్తున్న పేదలు దశాబ్దాలుగా మున్సిపల్ పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తూ ప్రభుత్వానికి, స్థానిక సంస్థలకు తమ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని నున్నా నాగేశ్వరరావు తెలిపారు. రోజువారీ కూలీ పనులు, వివిధ చేతివృత్తులు చేసుకుంటూ సాధారణ జీవనం సాగిస్తున్న పేదలపై ప్రభుత్వం,మున్సిపల్ అధికారులు ప్రతాపం చూపడం సరికాదన్నారు.60 అడుగుల రోడ్డు, 80 అడుగుల రోడ్డు విస్తరణ పేరుతో పేదలను ఆ ప్రాంతం నుంచి వెళ్లగొట్టేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. పేదలు అక్కడి నుంచి వెళ్లిపోతే తమ ఆస్తుల విలువలు పెరుగుతాయనే స్వార్థ ప్రయోజనాలతోనే ఇలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు....

**. 15 రోజుల్లో ఇళ్లు తొలగించకపోతే చర్యలంటూ నోటీసులు....**




మున్సిపల్ అధికారులు జారీ చేసిన నోటీసుల్లో 15 రోజుల్లో ఇళ్లను తొలగించుకోవాలని, లేకపోతే తామే తొలగిస్తామని హెచ్చరించినట్లు నున్నా నాగేశ్వరరావు తెలిపారు. దశాబ్దాలుగా నివసిస్తున్న పేద కుటుంబాలను ఒక్కసారిగా ఇళ్ల నుంచి ఖాళీ చేయించడం అన్యాయమని అన్నారు.ఈ విషయంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకుని బాధిత పేదలకు న్యాయం చేయాలని ఆయన కోరారు. మంత్రి పేదల సమస్యపై సానుకూలంగా స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు....




**"మరో వెలుగుమట్ల సమస్యగా మార్చకండి"...**

శ్రీనివాస్ నగర్ సమస్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఇది మరో వెలుగుమట్ల సమస్యగా మారే ప్రమాదం ఉందని నున్నా నాగేశ్వరరావు హెచ్చరించారు. పేదల ఇళ్లను తొలగించే చర్యలకు బదులుగా వారి నివాస హక్కులను కాపాడే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని సూచించారు.టింబర్ పరిశ్రమలతో ప్రజలకు అనారోగ్య సమస్యలు,ఇదే సమయంలో శ్రీనివాస్ నగర్ ప్రాంతంలో కొనసాగుతున్న టింబర్ పరిశ్రమలను నగరానికి వెలుపలికి తరలించాలని నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. నివాస ప్రాంతంలో చెక్క కోత మిషన్లు నిర్వహించడం వల్ల చెక్క దుమ్ము, ధూళితో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ ప్రాంతంలో అయ్యప్ప స్వామి గుడి, పలు పాఠశాలలు, పెట్రోల్ బంకులు ఉన్నాయని, ఇలాంటి ప్రదేశాల్లో టింబర్ కటింగ్ మిషన్లు కొనసాగడం వల్ల ప్రజలకు, విద్యార్థులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందన్నారు. ప్రజల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ చిన్నతరహా పరిశ్రమలను నివాస ప్రాంతాలకు దూరంగా తరలించాలని కోరారు.....

**ప్రజా, న్యాయ పోరాటాలకు సీపీఎం అండ...**

ఇళ్ల తొలగింపు నోటీసులతో బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నున్నా నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. బాధితులకు సీపీఎం పార్టీ అండగా ఉంటుందని, అవసరమైతే ప్రజా పోరాటాలతో పాటు న్యాయపరమైన పోరాటాలు కూడా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.ధర్నా అనంతరం బాధితులతో కలిసి మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. సమస్యను పరిశీలించి పేదల ఇళ్ల తొలగింపు నోటీసులను ఉపసంహరించుకోవాలని, టింబర్ పరిశ్రమలను నివాస ప్రాంతం నుంచి తరలించే చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్యనా రాయణ, త్రీ టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్, డివిజన్ నాయకులు యర్రా గోపి, వజినేపల్లి శ్రీనివాసరావు, బండారు యాకయ్య, ఎస్కే ఇమామ్, యర్రా రంజిత్, బండారు సునీత తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి: డా. బానోత్ చంద్రావతి

**తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంచిన నాయకుడు కేసీఆర్...**

**10 శాతం ఎస్టీ రిజర్వేషన్‌కు గుర్తుగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం...**

**ఖమ్మం సిటీ (జనం ముచ్చట):** తెలంగాణలో గిరిజనులకు ఎస్టీ రిజర్వేషన్‌ను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచి అమలు చేయడంతో పాటు, తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి గిరిజనులకు స్వయం పాలన, రాజకీయ ప్రాతినిధ్యం, ఆత్మగౌరవాన్ని కల్పించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కుతుందని వైరా మాజీ ఎమ్మెల్యే డా. బానోత్ చంద్రావతి అన్నారు. 10 శాతం ఎస్టీ రిజర్వేషన్ అమలుకు గుర్తుగా ఖమ్మంలో బీఆర్ఎస్ గిరిజన నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించి గిరిజనుల హక్కులు, రిజర్వేషన్లు, తండాల అభివృద్ధి తదితర అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా డా. బానోత్ చంద్రావతి మాట్లాడుతూ.. గిరిజనుల దశాబ్దాల ఆకాంక్షను గుర్తించి 10 శాతం ఎస్టీ రిజర్వేషన్ అమలు చేసిన కేసీఆర్ ప్రభుత్వం, తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడం ద్వారా గిరిజనులకు స్వయం పాలనకు అవకాశం కల్పించిందని పేర్కొన్నారు.

**గిరిజన విద్యకు కెసిఆర్ ప్రాధాన్యత ఇచ్చారు....**

“10 శాతం రిజర్వేషన్ కేవలం శాతం పెంపు కాదు గిరిజన యువత విద్య, ఉద్యోగాలు,భవిష్యత్తుకు కల్పించిన హక్కు అని తెలిపారు,తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడం గిరిజనుల స్వయం పాలనకు వేసిన బలమైన పునాది” అని చంద్రావతి అన్నారు.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గిరిజన విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని ఆమె గుర్తు చేశారు. గిరిజన గురుకులాల విస్తరణ, తండాలు--గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, పోడు భూముల




సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలు గిరిజన సమాజానికి ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. గిరిజనుల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు కీలకంగా నిలిచాయని అన్నారు.....

**కాంగ్రెస్ హామీలను అమలు చేయాలి....**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో గిరిజనులకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని బీఆర్ఎస్ గిరిజన నాయకులు విమర్శించారు. గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, విద్యలో రిజర్వేషన్ ప్రయోజనాలను సమర్థంగా అమలు చేయడం, పోడు భూముల సమస్యలను పరిష్కరించడం, తండాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ పథకాలను అమలు చేయడంపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు ఇప్పటికే సాధించిన హక్కులను కాపాడటంతో పాటు, ఇంకా పరిష్కారం కావాల్సిన సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని వారు స్పష్టం చేశారు. సెప్టెంబర్ 17 కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలనీ,గిరిజనులకు 10 శాతం ఎస్టీ రిజర్వేషన్ కల్పించడం, తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడం వంటి నిర్ణయాల చారిత్రాత్మక ప్రాధాన్యతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు....

**గిరిజనుల ఆత్మగౌరవం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు...**

“ఒక ప్రభుత్వాన్ని గిరిజనులు కేవలం మాటలతో గుర్తుంచుకోరు. తమకు లభించిన హక్కులు, అవకాశాలు, ఆత్మగౌరవంతో గుర్తుంచుకుంటారనీ, ఆ విషయంలో కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు తెలంగాణ గిరిజన చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయి” అని డా. బానోత్ చంద్రావతి పేర్కొన్నారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, సాధించిన హక్కులను కాపాడటంతో పాటు ఇంకా రావాల్సిన హక్కుల కోసం బీఆర్ఎస్ గిరిజన నాయకత్వం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భగత్‌వీడు తండా సర్పంచ్ వసంత, గొల్లపల్లి సర్పంచ్ బదావత్ అనుషా,మంగల్ తాండా సర్పంచ్ బుగ్లోత్ మాధవి, బాణోత్ దిక్షం నాయక్,జర్పులా బాలాజీ,బోడా మంచా నాయక్,మాజీ సర్పంచ్ అమర్ సింగ్,మాజీ జెడ్పీటీసీ, బోడా వీరకుమార్,బుక్యా సాయి,స్టూడెంట్ ఆర్గనైజేషన్ సభ్యులు అలాగే ధరావత్ శంకర్, బాణోత్ కొండా, బానోత్ కృష్ణ,బాణోత్ కిషన్, లకావత్ గిరిబాబు, మంచా నాయక్, బుక్యా కృష్ణ, బాణోత్ కిషన్ నాయక్, బాణోత్ బాలాజీ నాయక్, బాణోత్ భిక్షం, బాణోత్ రెడ్డియా నాయక్, మాళోత్ నాగేశ్వర్ రావు, శంకర్ నాయక్, జర్పులా వీరన్న, తేజవత్ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు....

# ఖమ్మం కేంద్రంగా ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

## పీడీఎస్‌యూ డిమాండ్

**ఖమ్మం సిటీ (జనం ముచ్చట):** తెలంగాణలో ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్ విమర్శించారు. ప్రభుత్వ విద్యను కాపాడాలని, విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఖమ్మం నగర కమిటీ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ సబ్ క్యాంపస్ ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వంగూరి వెంకటేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల మూసివేతను తక్షణమే నిలిపివేయడంతో పాటు, ఇప్పటికే మూసి వేసిన పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయకుండా విద్యార్థులను ప్రైవేట్ విద్యాసంస్థల వైపు నెట్టే పరిస్థితులను ప్రభుత్వం నివారించాలని సూచించారు.

**ఖమ్మం కేంద్రంగా ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి....**

ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం జిల్లాకు ఖమ్మం కేంద్రంగా ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని




ఆణాఖ నాయకులు పేర్కొన్నారు. ఈ అంశంపై అసెంబ్లీ సాక్షిగా చర్చించి, జిల్లాలోని విద్యార్థులకు అందుబాటులో ఉన్నత విద్యా అవకాశాలు పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్నత విద్యకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, నిర్మాణంలో ఉన్న విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా మంత్రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఖమ్మం జిల్లాలోనే ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే స్థానికంగా ఉన్న వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్య మరింత అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని పీడీఎస్‌యూ నాయకులు ఆరోపించారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారంగా మార్చే విధానాలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని కోరారు.అదేవిధంగా విద్యార్థులపై పెంచిన బస్సు పాస్ చార్జీలను తగ్గించి, విద్యార్థులకు ఉచిత బస్సు పాస్‌లు అందించాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులపై రవాణా ఖర్చుల భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు....

**పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి....**

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో అనేక మంది విద్యార్థులు కళాశాలల్లో తమ సర్టిఫికెట్లు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని, ఫలితంగా ఉన్నత విద్యలో ప్రవేశాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని, సర్టిఫికెట్ల సమస్యను పరిష్కరించి ఉన్నత విద్యకు ఆటంకాలు లేకుండా చూడాలని కోరారు.....

**సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం....**

ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్క రించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని ఆణాఖ తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా నాయకులు సురేష్, నగర అధ్యక్షుడు హరి చంద్ర ప్రసాద్, నవ్య, కావ్య, అలేఖ్య, నవీన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం నగరంలో నీటి ఎద్దడిపై మంత్రి తుమ్మల ఆరా

**శ్రీనగర్, మధురానగర్, రోటరీనగర్‌తో పాటు పలు కాలనీల్లో తగ్గుతున్న భూగర్భ జలాలు**

**చెరువులు నింపి భూగర్భ జలాలను పెంచేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం**

**వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచన**



ఖమ్మం సిటీ (జనం ముచ్చట):
ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడంతో తలెత్తుతున్న నీటి ఎద్దడిపై రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరా తీశారు. నగరంలోని శ్రీనగర్, మధురానగర్, రోటరీనగర్‌తో పాటు పలు కాలనీల్లో ఇళ్లలోని బోర్లలో నీటి మట్టం తగ్గిపోవడంతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను డివిజన్ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇళ్లలో ఏర్పాటు చేసుకున్న బోర్లలో గతంతో పోలిస్తే నీటి లభ్యత గణనీయంగా తగ్గిందని, దీంతో తాగునీటితో పాటు ఇతర అవసరాలకు నీటి సమస్యలు ఎదురయ్యే పరిస్థితి నెలకొందని నాయకులు మంత్రి తుమ్మల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు.....

**చెరువులు, కుంటలు నింపాలని అధికారులకు ఆదేశం....**

ఖమ్మం నగర పరిధిలోని లకారం, పుట్టకోట, గొల్లగూడెం చెరువులను నీటితో నింపేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. చెరువుల్లో నీరు నిల్వ ఉండటం ద్వారా పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాల మట్టం పెరిగే అవకాశం ఉంటుందని, అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

వర్షపు నీటిని ఒడిసిపట్టాలనీ, భూగర్భ జలాల పెంపునకు వర్షపు నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. వర్షం ద్వారా లభించే నీటిని వృథాగా బయటకు వెళ్లకుండా నిల్వ చేయడం, అవసరమైన ప్రాంతాల్లో రీచార్జ్ చర్యలు చేపట్టడం ద్వారా భూగర్భ జలాలను పెంచేందుకు కృషి చేయాలని అన్నారు, నగరంలో ప్రస్తుతం ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు భవిష్యత్‌లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

అప్రమత్తంగా ఉండాలని ఆదేశం...

**శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని ఆదేశం....**

ఖమ్మం నగరంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. నీటి లభ్యత, భూగర్భ జలాల పరిస్థితి, చెరువుల్లో నీటి నిల్వ తదితర అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

వేసవి కాలంలో తీవ్రమయ్యే అవకాశం ఉన్న నీటి సమస్యను ముందుగానే గుర్తించి పరిష్కరించేందుకు శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని, నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి తుమ్మల ఆదేశించారు.

భూగర్భ జలాల పెంపు, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ వంటి అంశాలపై సమగ్ర దృష్టి సారిస్తే ఖమ్మం నగరంలో నీటి సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం లభించే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు....



# గంజాయి సరఫరా, సైబర్ నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాలు నివారణపై ప్రత్యేక దృష్టి పట్టాలి

**నేర సమీక్షా సమావేశం లో పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

ఖమ్మం, (జనం ముచ్చట)

గంజాయి వినియోగించే అవకాశం ఉన్న నిర్మానుష ప్రాంతాలు, శివారు ప్రాంతాలు, ఖాళీ ప్రదేశాలు, పాడుబడిన భవనాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులకు ఆదేశించారు.

పోలీస్ అధికారులతో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. నిర్మానుష ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ గంజాయి వినియోగం, విక్రయాలు, సరఫరాకు పాల్పడే వారిని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

గంజాయి సరఫరా చేస్తున్న ప్రధాన వ్యక్తులను గుర్తించి, వారి నెట్‌వర్క్‌ను ఛేదించడంతో పాటు వినియోగదారులను కూడా గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు నిరంతర నిఘా, తనిఖీలు, అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేయాలని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.

సైబర్ నేరాల నియంత్రణకు సమర్థవంతమైన వ్యూహంతో ముందుకు వెళ్లాలని, సైబర్ నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి, నేరాల వెనుక ఉన్న మొత్తం నెట్‌వర్క్‌ను ఛేదించేలా దర్యాప్తు చేపట్టాలని సూచించారు.

సైబర్ మోసాలకు గురైన బాధితుల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి, బ్యాంకులు--ఆర్థిక సంస్థలతో సమన్వయం చేసుకుంటూ మోసపోయిన నగదును వీలైనంత త్వరగా ఫ్రీజ్ చేయించి బాధితులకు తిరిగి అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

డిజిటల్ అరెస్టులు, పెట్టుబడి మోసాలు, ఓటీపీ మోసాలు, ఫేక్ లింకులు, సోషల్ మీడియా మోసాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి, ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, రాంగ్‌రూట్ డ్రైవింగ్, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగించకపోవడం వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

ప్రధాన రహదారులు, జంక్షన్లు, ప్రమాదకర మలుపుల వద్ద నిరంతర నిఘా, వాహన తనిఖీలు చేపట్టాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పోక్సో కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, ఆధారాలను పకడ్బందీగా సేకరించి, నిందితులకు శిక్ష పడే విధంగా కోర్టు కేసులను సమర్థవంతంగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

మహిళలు, బాలికలపై నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఫిర్యాదులపై వెంటనే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

దర్యాప్తు పూర్తయిన కేసుల్లో పెండింగ్‌లో ఉన్న ఛార్జ్‌షీట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయకుండా వెంటనే పూర్తి చేసి కోర్టుల్లో దాఖలు చేయాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు.

కేసుల దర్యాప్తులో జాప్యం జరగకుండా ప్రతి కేసును నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాలని, పెండింగ్ కేసులను అధికారులు స్వయంగా సమీక్షిస్తూ దర్యాప్తు పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

నేరస్తులకు శిక్ష పడేలా పకడ్బందీ దర్యాప్తు, బలమైన ఆధారాల సేకరణ, సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

సమావేశంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీ రమణమూర్తి, సాంబరాజు, ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

# వీర తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

**సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం.హేమంతరావు**

రఘునాదపాలెం, (జనం ముచ్చట):

భూమి, భుక్తి కొరకు వెట్టి చాకిరి నుండి విముక్తి కొరకు కుల, మత అతీతంగా భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన వీరోచిత వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం అన్ని, ఈ పోరాటాన్ని హిందూ ముస్లిం ల పోరాటంగాన ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులు చేసిన పోరాటంగా బీజేపీ వర్ణిస్తూ చరిత్రను వక్రీకరిస్తుశీన్నారని, సెప్టెంబర్ 17 నీ సాయుధ పోరాట దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలనీ సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం. హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి. సురేష్ లు డిమాండ్ చేశారు.

భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11 నుండి 17 వరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలలో భాగంగా స్థానిక చిమ్మపూడి గ్రామ సెంటర్ లో ఉన్న వీర తెలంగాణ సాయుధ పోరాట యోధుడు 6 పర్యాయాలు శాసన సభ్యులు రజబ్ అలీ గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించడం జరిగింది. అనంతరం సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతల రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో వారు ముఖ్య అతిథిలుగా పాల్గొని మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో కామ్రేడ్ నల్లమల. గిరిప్రసాద్ , రజబ్ అలీ గార్ల నాయకత్వంలో వీర తెలంగాణ సాయుధ పోరాటం జరిగిందని వారి స్పూర్తితో పోరాటాలను ఉదృతం చేస్తాం అన్ని వారు తెలిపారు. అసలు ఈ పోరాటానికి బీజేపీ, ఆర్.ఎస్.ఎస్ వారికి ఏమి సంబంధం లేదని ఉంటే బీజేపీ, ఆర్.ఎస్.ఎస్ వాళ్ళు ఒక్కరైనా ఈ పోరాటంలో చనిపోతే వారి పేరు చెప్పే దమ్ము బీజేపీ, ఆర్.ఎస్.ఎస్
నేతలకు ఉందా....?అన్ని వారు సవాల్ విసిరారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో ఈ మహత్తర పోరాటం చేయడం ఫలితంగా 10 లక్షల ఎకరాల దొరల, భూస్వాముల భూములు పేదలకు పంచడం జరిగిందని, అయిదు వేల గ్రామాలు విముక్తి పొందాయని, మూడు వేల మందికిపైగా కమ్యూనిస్ట్ పార్టీ కార్యకర్తలు ప్రాణాలను అర్పించారని వారు తెలిపారు. ఇంతటి చరిత్రాత్మక మహత్తర పోరాటాని కమ్యూనిస్టులకు పేరొస్తుందని నాడు బి.ఆర్. ఎస్, నేడు కాంగ్రెస్ ప్రభుత్వాలు సాయుధ పోరాట దినోత్సవంగా జరపకుండా పేర్లు మార్చి జరపడం సరికాదని, వెంటనే సెప్టెంబర్ 17 నీ సాయుధ పోరాట దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలనీ వారు డిమాండ్ చేశారు.